ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి : త్వరలో జరగబోవు 2024 సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వివరించారు. శుక్రవారం సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పెండింగ్ ఫామ్స్ పరిష్కారం, మీడియా రిపోర్టులపై చర్యలు, ఓటరు కార్డు జనరేషన్, ప్రింటింగ్, పంపిణీ, వివిధ అంశాలలో సిబ్బందికి ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్, ఎన్నికల జిల్లా కంట్రోల్ రూమ్ ఏర్పాటు, ఇతర అంశాలలో పూర్తి చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి బి.ఆర్ మీనా జిల్లా కలెక్టర్లతో విసి నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. విసి అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకను పరిష్కరించాల్సిన 13 వేల ఫామ్స్‌ను త్వరగా పరిశీలన పూర్తి చేసి వెంటనే సిఇఒ కార్యాలయానికి నివేదిక పంపాలన్నారు. నూతనంగా ప్రింట్ అయిన ఓటర్ కార్డులను పోస్టల్ శాఖతో సమన్వయం చేసుకొని సంబంధితులకు అందేలా తగిన పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా ఎలక్షన్ మేనేజ్మెంట్‌పై సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు. రాజకీయ పార్టీలకు, మీడియా వారికి కూడా ఎన్నికలకు సంబంధించిన అంశంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుకు షెడ్యూల్ రూపొందించాలని పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు 783 మంది విద్యార్థులు గైర్హాజర్

ప్రజాశక్తి-రాయచోటి

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మొదటి రోజు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 54 కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉదయం 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాలకు చేరుకుని, తమ హాల్ టికెట్ నెంబర్ల ఆధారంగా తమకు కేటాయించిన గదుల అన్వేషణలో పడ్డారు. తల్లిదండ్రులు కొందరు తమ పిల్లలతో కలిసి వచ్చి పరీక్షా కేంద్రంలో వారికి కేటాయించిన గదుల వెతకడంలో సాయపడటం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా మొత్తం 15,492 మంది విద్యార్థులు ఉండగా 14,709 మంది హాజరయ్యారు. 783 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ 14,194 విద్యార్థులు ఉండగా 13,528 మంది హాజరు కాగా 666 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్స్‌లో 1,298 మంది మొత్తం విద్యార్థులు ఉండగా 1,181 మంది విద్యార్థులు హాజరుకాగా 117 మంది గైర్హాజరయ్యారు. రాయచోటి పట్టణంలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 6,184 మంది విద్యార్థులు ఉండగా 6,082 మంది హాజరుకాగా 102 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ సూపపరింటెండెంట్ ఆఫీసర్లు 54, అడిషనల్ స్టాఫ్ సూపర్నెంట్ 26, ఫ్లైయింగ్ స్క్వాడ్ ముగ్గురు, 1,065 ఇన్విజిలేటర్లును ఏర్పాటు చేశారు. పరీక్ష జరిగే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం, మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. పరీక్ష సమయంలో

రాయచోటి: నోటీసు బోర్డులో రూములు చూసుకుంటున్న విద్యార్థులు

పీలేరు : పరీక్ష రాస్తున్న ప్రథమ సంవత్సరం విద్యార్థులు

విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. ప్రతి సెంటర్ నందు ఎఎన్ఎం, తాగనీరు, మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేశారు. జిరాక్స్ సెంటర్‌ను మూసి వేయించారు. సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను నిషేధించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. **పీలేరు:** ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 1,276 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 1,212 మంది మాత్రమే హాజరయ్యారు. 64 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. **కలకడ:** మండలంలో 377 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 363 మంది హాజరు కాగా 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. **నిమ్మనపల్లి:** మండలంలో 171 మంది విద్యార్థులకు గాను 165 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ, చేగు రెడ్డప్పరెడ్డిలు పర్యవేక్షించారు. **పుల్లంపేట :** మండల కేంద్రంలోని ఎస్‌బివిడి సభ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 119 విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామ్ సెంటర్ చీఫ్ వెంకటేశ్వర్లు తెలిపారు. **తంబళ్లపల్లి :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 147 మంది విద్యార్థులకు గాను 141 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని చీఫ్ ఎగ్జామినర్ సాయి శంకర్‌రెడ్డి తెలిపారు.

పెండింగ్ స్థానాలపై ఉత్కంఠ!

- టిడిపి టికెట్ ఆశావహుల్లో ఆందోళన
- నాలుగు స్థానాల్లో ఎనలేని ఉత్కంఠ
- సర్వేల ఆధారంగానే ఎంపిక



జిల్లాలోని పెండింగ్ స్థానాలను ఆశిస్తున్న ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇటీవల టిడిపి, జనసేన ఉమ్మడి తొలి జాబితాలో ఉమ్మడి కడప జిల్లాలోని నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. జిల్లాలోని మిగిలిన ఆరు అసెంబ్లీ టికెట్లు ఆశిస్తున్న ఆశావహులకు జనసేన, బిజెపి గుబులు పట్టుకుంది. వీటికి ఏయే టికెట్లను కేటాయిస్తారో, ఎక్కడ అవకాశం కోల్పోవాల్సి వస్తుందోననే ఆందోళన నెలకొంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టిడిపి, జనసేన ఉమ్మడి తొలిజాబితా ప్రకటన ఆశావహుల్లో గుబులు రేపింది. ఉమ్మడి కడప జిల్లాలో కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, రాయచోటి, బద్వేల్, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు ఉన్నాయి. తొలి విడత కింద కడప, మైదుకూరు, పులివెందుల, రాయచోటి స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. వీరిలో ఒకరు సీనియర్, ముగ్గురు తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. మిగిలిన ఆరు నియోజకవర్గాలకు చెందిన ఆశావహుల్లో టెన్షన్ వాతావరణం ఏర్పడింది. కమలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక విషయంలో టిడిపి అధిష్టానం సర్వేలపై ఆధారపడి ఎంపిక చేస్తోంది. రిజర్వుడు నియోజకవర్గాలైన బద్వేల్‌లో మాజీ ఇరిగేషన్ అధికారి రోశయ్య, రైల్వేకోడూరులో ఎన్ఆర్ఐ రేఖ పేర్లను సూచనప్రాయంగా పరిశీలించింది. తొలిజాబితాలో వీరి పేర్లను ఎంపిక చేయకపోవడంతో నివ్వెరపోయారు. వీటిల్లో ఏదైనా స్థానాన్ని జనసేన, పొత్తు కుదిరితే బిజెపికి కేటాయిస్తారేమోననే ఆందోళన నెలకొంది. అన్‌రిజర్వుడు స్థానాలైన జమ్మలమడుగు, రాజంపేటను పొత్తు ధర్మంలో భాగంగా బిజెపి, జనసేన కోరే అవకాశాలున్నాయి. ఇందుకు అనుగుణంగానే ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులుగా ప్రచారంలో ఉన్న నాయకులు రాజధానిలో తిష్ట వేసి టికెట్ల కోసం పైరవీలు చేసుకునే పనిలో నిమగ్నమైనట్లు ప్రచారం నడుస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రాజంపేట టిడిపి టికెట్ కోసం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయులు, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు జగన్మోహన్‌రాజు, ప్రముఖ పారిశ్రామికవేత్త గంటా నరహరి ఎన్నికల ప్రచారం మొదలుకుని సామాజిక సేవా కార్యక్రమాలను పోటా పోటీగా నిర్వహిస్తున్నారు. రాజంపేట టికెట్‌ను జనసేనకు కేటాయిస్తే పరిస్థితేమిటనే ఆందోళన కేడర్‌లో నెలకొంది. జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తనదైన శైలిలో పాదయాత్ర నిర్వహిస్తూ ప్రజల్లోకి చొచ్చుకునిపోయారు. ఇటువంటి సమయంలో బిజెపితో పొత్తు పేరుతో మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డికి కేటాయించే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే తమ పరిస్థితేమిటనే ఆందోళన నెలకొంది. కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి టికెట్ రేసులో ముందంజలో ఉన్నారు. ఇటీవల టిడిపిలో చేరిన మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి టికెట్ ఆశిస్తుండడం ఉత్కంఠను కలిగిస్తోంది. ప్రొద్దుటూరు టికెట్ కోసం నలుగురు ఆశావహులు బరిలో నిలిచారు. వీరిలో ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, మల్లెల లింగారెడ్డి, కొత్తగా ఇద్దరు అభ్యర్థులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సి.ఎం సురేష్‌నాయుడు టికెట్‌ను ఆశిస్తున్నారు. వీరిలో ప్రవీణ్‌కు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పర్యటన సమయంలో ప్రకటన చేయడం దగ్గర నుంచి తాజాగా పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి మద్దతు ఉన్న కారణంగా టికెట్ లభించే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఎన్ని హామీలు ఇచ్చినప్పటికీ టిడిపి అధిష్టానం నిర్వహిస్తున్న సర్వేలు కీలకమని తెలుస్తోంది. సర్వేలు ఎవరి వైపు మొగ్గు చూపుతాయో, అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో, ఎవరికి టికెట్ లభిస్తుందో వేచిచూడాల్సి ఉంది.

పేదరికంతో చదువుకు దూరం కాకూడదు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

పేదరికంతో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని జగనన్న విద్యా దీవెన పథకాన్ని అమలు చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రు నుంచి జగనన్న విద్యా దీవెన పథకం కింద అక్టోబర్, డిసెంబర్-2023 త్రైమాసికానికి సంబంధించి పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, బటన్ నొక్కి తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో నేరుగా జమ చేశారు. రాయచోటి కలెక్టరేట్ విసి హాలు నుండి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సోషల్ వెల్ఫేర్ డిడి జాకీర్ హుస్సేన్, బిసి సంక్షేమ శాఖ అధికారి సందప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తి స్థాయి ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయడం విద్యార్థుల అదృష్టమని ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం ప్రతి ఒక్కరూ ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, ఆపై స్థాయి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి ఈ పథకం ఒక వరం లాంటిదని ప్రభుత్వం అందిస్తున్న విద్య దీవెన సాయం సద్వినియోగం చేసుకొని మీరు ఎంచుకున్న లక్ష్యం పైపు అడుగులేయాలన్నారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయడం జరిగిందని ఇంత మంచి అవకాశాలను విద్యార్థులు

విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం జగనన్న విద్యా దీవెన పథకం కింద అక్టోబర్, డిసెంబర్-2023 త్రైమాసికానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా అర్హులయిన 31,478 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.24.80,81,198 మెగా చెక్కును విద్యార్థులు వారి తల్లులకు జిల్లా కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ శాఖ, విద్యాశాఖ అధికారులు, జిల్లాలోని పలు డిగ్రీ, ఇంజినీరింగ్ ఇతర ప్రొఫైషనల్ కోర్సుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లతో పేదలు అప్పులపాలు : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో గృహ నిర్మాణాలపై కల్లబొల్లి కబుర్లు చెప్పి పేదలకు ఏడాదికి 5 లక్షలు చొప్పున 25 లక్షల ఇళ్ళు నిర్మించి ఉచితంగా అందజేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు అన్నారు. ఇళ్లను ఉచితంగా ఇవ్వకపోగా గృహాలు నిర్మించుకోకపోతే పట్టాలు రద్దు చేస్తామని బెదిరించి, పేదల చేత అప్పు చేసి ఇళ్ళు కట్టించి వారికి బిల్లులు కూడా చెల్లించక జగనన్న ఇళ్ల నిర్మాణాలతో పేదలను అప్పులు పాలు చేశారని ఆరోపించారు. శుక్రవారం బత్యాల భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల పేరుతో డ్వాక్రా మహిళలు ఒక్కొక్కరికి రూ.35 వేలు చొప్పున రూ.3,866 కోట్లు అప్పు తెచ్చి మహిళల నెత్తిన వేల కోట్లు అప్పులు నెత్తిన వేశారని పేర్కొన్నారు. టిడ్కో ఇళ్లను తాకట్టు పెట్టి పదివేల కోట్లు అప్పు తెచ్చారని, రుణాల పరిమితి తీరిపోవడంతో బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు నేరుగా నోటీసులు అందుతున్నాయని తెలిపారు. ఒటిఎస్ పేరుతో ఎన్టీఆర్ చంద్రబాబు ఉచితంగా అందించిన ఇళ్లకు బలవంతంగా రూ.పది వేల నుండి రూ.30 వేలు జగన్ వసూలు చేశారని ఆరోపించారు. ఊరికి దూరంగా నివాసయోగ్యం కాని చోట స్థలాలు ఇచ్చి బూడిద కలిపిన భారతి సిమెంటుతో ఇళ్ల నిర్మాణం చేసి అవి కూలిపోయేటట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 12 లక్షల నాణ్యమైన ఇల్లు కట్టగా జగన్ 10 శాతం కూడా ఇళ్ల పూర్తి చేయలేదని తెలిపారు. కేంద్రం ఇచ్చిన రూ.1.80 లక్షలతోనే సరిపెట్టాడు కానీ రాష్ట్ర నిధులు కేటాయించలేదని ఆరోపించారు. సిమెంటు, స్టీల్ ధరలు విపరీతంగా పెంచి

సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయుడు

పేదలపై భారం మోపుతున్నారని విమర్శించారు. టిడిపి ఆవిర్భావం మునుపు పక్కా గృహాలు లేవని, ఎన్టీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే పక్కా గృహాల నిర్మాణం ప్రారంభమైందని తెలియజేశారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 12,56,374 పక్కా గృహాలు నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు, కౌన్సిలర్ తుపాకుల అశోక్ కుమార్, డిఆర్ఎల్ మణి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రేవూరి వేణుగోపాల్, జ్యోతి శివ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు చూపిస్తున్న విద్యార్థులు

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

వ్యవస్థాపక మనస్తత్వం పెంపొందించు కోవడం వలన పారిశ్రామికవేత్తగా ఎదగవచ్చునని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఎంటర్ ప్రేన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్మెంట్ జిల్లా స్థాయి ప్రాజెక్టు ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యవస్థాపక ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. సరైన నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉపాధి కల్పించే స్థాయికి చేరవచ్చన్నారు. పాఠశాల విద్యాశాఖ, ఉద్యం స్వఛరేద సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 75 మంది విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఈ ఎక్స్ పోలో ప్రదర్శించారు. అందులో నుండి రెండు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడమైనది. ఓబులవారిపల్లి మండలం చిన్న ఓరంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వెంకటసుబ్బయ్య, వినయ్ కుమార్ రూపొందించిన ఎయిర్ ప్యూరిఫైయర్, సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మస్తాన్, రోహిత్ రూపొందించిన రెయిన్ డిటెక్టర్ క్రాప్ ప్రొటెక్టర్ అను ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ఈ విద్యార్థులు ఈ నెల ఆరవ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు హాజరు కావాల్సి ఉందన్నారు. వీరికి డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అజయ్ కుమార్‌బాబు, డిసిఇబి సెక్రటరీ నాగమునిరెడ్డి, ఇఎండిపి జిల్లా మేనేజర్ కరిముల్లా మెమెంటోలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆప్ కాస్ట్ కన్వీనర్ రవీంద్రారెడ్డి, జిల్లా అకాడమిక్ కో-ఆర్డినేటర్ రవి శంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులుగా సురేంద్ర

ప్రజాశక్తి-మదనపల్లి

రాజంపేట పార్లమెంట్ టిడిపి జిల్లా ఉపా ధ్యక్షులుగా పులకంటి సురేంద్ర ఎన్నికైనట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి యాలగిరి దొరస్వామి నాయుడు తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం తుమ్మచెట్లపల్లి గ్రామానికి చెందిన సురేంద్ర టిడిపిలో ఎన్నో ఏళ్ళగా కొనసాగుతున్నారు. ఆయన తండ్రి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేశారు. తరతరాలుగా ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన కుటుంబంగా పేరు పొందింది. ఆయన కుటుంబంతో పాటు ఆ గ్రామస్తులందరూ టిడిపి పార్టీకి ఆనాటి నుండి అండగా నిలుస్తున్నారు. పార్టీకి నిస్వార్థంగా సేవలు అందించిన పులకంటి కుటుంబానికి కీలక పదవి దక్కింది. రాజంపేట పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యం చేతుల మీదుగా రాజంపేట పార్లమెంటు జిల్లా ఉపాధ్యక్షుడి నియామక పత్రాన్ని అందుకున్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వెనుకబడిన వర్గాల అభివృద్ధే చంద్రబాబు లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధిని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కెవి పల్లి మండలం, దేవాండ్లపల్లి, జిల్లేళ్లమంద తాండా, నగరి, శెట్టిపల్లి, వడ్డిపల్లి తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిషత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు పేదల సంక్షేమం కోసం పెళ్లికానుక, చంద్రన్న బీమా, క్రిస్మస్ కానుక, రంజాన్ తోఫా, సంక్రాంతి కానుక, అన్నా క్యాంటీన్ లాంటి పథకాలు తీసుకువచ్చారన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేసి పేదల నోరు కొట్టారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే రద్దు చేసిన పథకాలు మళ్ళీ తాము అమలు చేసి అందరికి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కెవి పల్లి మండలం జిల్లేళ్లమంద గ్రామం పూర్తిగా సిసి రోడ్లు, డబుల్ రోడ్లు, హెల్త్ సెంటర్లు నిర్మాణం, సబ్ స్టేషన్ ఏర్పాటు, దేవాండ్లపల్లి-జిల్లేళ్లమంద గ్రామాలకు తెప్పలపై తిరిగే పరిస్థితులను గుర్తించి పింఛా నదిపై వంతెన నిర్మించి వారధిగా నిలిచింది నల్లారి కుటుంబమేనని గుర్తు చేశారు. ఈసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే గ్రామాల వారీగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, వాటి అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగ స్ఫూర్తితో పోరాడాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అలుపెరగని పోరాటం చేసి అమరులైన వారి స్ఫూర్తితో మాదిగలంతా ఐక్యమై వర్గీకరణ కోసం పోరాటాలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి వెలగచర్ల శివయ్య, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు మందా శివయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చేమూరి వెంకటేష్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అమరవీరులను స్మరించుకుంటూ నివాళి అర్పించారు. **రాయచోటి :**మాదిగ అమరవీరుల ఆశయాలను ఎంఆర్‌పిఎస్ మాదిగ అమరవీరుల 15వ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కో-కన్వీనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద మాదిగ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలోఎంఆర్‌పిఎస్ నాయకులు రామయ్య, వి.వెంకట రమణ, సుబ్బయ్య, ఆంజనేయులు, జయరామ, గంగులయ్య, రెడ్డయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లి

శుక్రవారం స్థానిక ఆరో వార్డు నందు కౌన్సిలర్ ప్రసాద్ బాబు గారి ఆధ్వర్యంలో జరిగిన నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మదనపల్లి వైఎస్ఆర్‌పి నియోజకవర్గ సమన్వయకర్త నిసార అహ్మద్ పాల్గొని కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ మనుజా రెడ్డి , జెడ్పిటిసి ఉదయ్ కుమార్ ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఇరాన్ ఖాన్ ఇతర కౌన్సిలర్లు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది : సుగవాసి, మండిపల్లి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని టిడిపి పార్లమెంట్ అభ్యర్థి సుగువాసి బాలసుబ్రహ్మణ్యం, రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బండ్లపెంటలో వెలసియున్న శ్రీయూసుఫ్ షాఖాదిరి దివానే సాహెబ్ పెద్దదర్గా 66వ ఉరుసు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉరుసు ఉత్సవాలలో భాగంగా గంధం సందర్భంగా దర్గా కమిటీ పెద్దలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాంప్రసాద్‌రెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు. వీరిద్దరిని దర్గా కమిటీ ప్రెసిడెంట్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సలావుద్దీన్, కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. గంధం సందర్భంగా మండిపల్లి దివానే సాహెబ్ దర్గాలో చాదర్‌ను సమర్పించి చదివింపులతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. దర్గా కమిటీ ప్రెసిడెంట్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సలావుద్దీన్‌తో పాటు, పూల వ్యాపారి మదనీ, బాష, మాజీ సర్పంచ్ నాగేశ్వర నాయుడు, సగీర్, మస్తాన్, అస్రఫ్, షాహుల్, దర్గా షరీఫ్, ఇమ్రాన్, శివ, రమేష్, సాంబశివారెడ్డి, కొండాలతో పాటు హిందూ, మహమ్మదీయ సోదరులు పాల్గొన్నారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష అని ఊటుకూరు-2 ఎంపిటిసి నాగ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఊటుకూరు గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి వెంకట శ్రీకాంత్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగా చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వాలంటీర్లు, ఆశా కార్యకర్తల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలను గుర్తించి ప్రతి సచివాలయం పరిధిలోను ప్రత్యేక వైద్య బృందంచే ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేయడం సురక్ష కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలు ఈ దేశంలోనే ఎక్కడా లేవని, ఆంధ్ర ప్రదేశ్ ను మిగిలిన రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని, ఈ ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి అవలంబిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఆదర్శనీయమని కొనియాడారు. నిరంతరం ప్రజల కోసం పరితపించే ఇలాంటి నాయకుడిని మరొకసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే రాష్ట్రం అభివృద్ధి బాటలో పరుగులు పెడుతుందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలలో వైసిపిని అఖండ మెజారిటీతో గెలిపించి జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేశారు. అనంతరం ప్రజలకు ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఊటుకూరు సర్పంచ్ ఈశ్వరయ్య, వైసిపి నాయకులు కంబాయిగారి నరసింహ, సచివాలయ సిబ్బంది మణికంఠ, రాణి, వెంకటయ్య, అచ్యుత్ సాయి, వైద్య సిబ్బంది, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సర్వే

ప్రజాశక్తి-మదనపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. కళాశాలకు సమీపంలోని ఒంటిమిట్టపల్లెను దత్తత తీసుకొని ఏడు రోజులపాటు క్యాంపు నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంపులో భాగంగా వివిధ కార్యక్రమాలైన స్కూల్ పిల్లలకి కంప్యూటర్ విద్యపై అవగాహన, ప్లాస్టిక్ నిర్మూలన, ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం, స్వచ్ఛభారత్, మొక్కల నాటడం వంటి కార్యక్రమాలు చేపడతారన్నారు మొదటి రోజైన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు ఈ సర్వే ద్వారా వారి సమస్యలను తెలుసుకొని తద్వారా సమస్యలు సర్పంచ్ తో చర్చించి పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్స్ రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై.అరుణ్ కుమార్‌రెడ్డి, అధ్యాపకుడు కె.మంజు బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సి-విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

ప్రజాశక్తి-రాయచోటి

భారతదేశ ఎన్నికల సంఘం రూపొందించిన సి-విజిల్, తదితర యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, జిల్లా ఎన్నికల అధికారికి సంబంధించిన సామాజిక మాధ్యమాలను ఫాలో అవ్వాలని, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాలు, భారతదేశ ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌ల ద్వారా సాధారణ ఎన్నికలు-2024కు సంబంధించి సమాచారం ఎటువంటి ఖర్చు లేకుండా పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ఎన్నికల సంఘం రూపొందించిన సి-విజిల్, నోయువర్ కాండిడేట్, ఓటర్ హెల్ప్‌లైన్, సాక్ష్యం వంటి ఆపులను గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చుని, వాటి ద్వారా చాలా సమాచారాన్ని పొందవచ్చని, ఎన్నికల సమయంలో సి-విజిల్ యాప్‌ను ఉపయోగించుకొని ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

మైనార్టీ కమ్యూనిటీ హాల్‌కు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ హాల్‌కి ఏపీఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి తన సొంత నిధుల నుంచి లక్ష విరాళంగా అందించారు. శుక్రవారం మండలంలోని గండబోయనపల్లిలోని జామియా మసీదులో ఏపీఎండిసి హరీష్ రెడ్డి పిఎ శ్రీనివాసులు ముస్లిం మత పెద్దలకు అందించారు. పెళ్లిళ్ళు, సమావేశాలు, తదితర వాటి కోసం కమ్యూనిటీ హాల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ షరీఫ్, షామీర్‌ఇ మక్బుల్ సాబ్, ఖాసీం సాబ్, అల్లాబక్షు, సంజీవ రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ఉత్తన్న, మౌల, ఖాదర్‌బాషా, అమాన్, భాస్కర్‌రెడ్డి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న హరీష్‌రెడ్డి

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న ఎంపిపి

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-వీరబల్లి

సిఎంరిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని ఎంపిపి రాజేంద్ర నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మట్లి పంచాయతీ పెద్దాడుకు చెందిన తాండ్ర పెద్ద వెంకటరమణ అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకున్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.5లక్షలు మంజూరు కావడంతో చెక్కును ఎంపిపి చేతుల మీదుగా తన స్వగృహంలో కుటుంబ సభ్యులకు అందించారు. ఎంపీ మిథున్ రెడ్డికి, మేడా మల్లికార్జునరెడ్డికి, అమర్నాథరెడ్డికి, ఎంపిపికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సింగిల్‌విండో అధ్యక్షులు రామాంజులరెడ్డి, బిసి సెల్ నాగభూషణం, సురేంద్రరెడ్డి, ఆర్.ఎం.రెడ్డి, నరేంద్రనాయుడు, రమేష్, పెంచలయ్య పాల్గొన్నారు.

30 పోలీసు యాక్ట్ అమలు

ప్రజాశక్తి-పెనగలూరు

మండల పరిధిలో 30 పోలీసుయాక్ట్‌ను అమలు చేస్తూ డిఎస్‌పి చైతన్య ఉత్తర్వులు జారీ చేశారని, శాంతిభద్రతల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. పోలీస్ యాక్ట్ లోని సెక్షన్ 30 ప్రకారం మండలంలో పోలీసుల ఆంక్షలు విధించవచ్చని ఈ సెక్షన్ అమల్లో ఉన్న సమయంలో శాంతిభద్రతలను పరిగణలోకి తీసుకొని బహిరంగ సభలు ర్యాలీలకు అనుమతి ఇచ్చే అధికారం పోలీసులకు ఉంటుందని అన్నారు. పోలీసు ఉన్నతాధికారులు తమ పరిధిలోని కొన్ని నిర్దిష్ట ప్రదేశాల్లో సమావేశాలు, ర్యాలీలో నిర్వహించకుండా కట్టడి చేయవచ్చునని అన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని భావించిన సందర్భాల్లోనూ సెక్షన్ 30ని పోలీసులు ప్రయోగిస్తారు. కావున నిషేధాజ్ఞలు ఉన్న ప్రాంతాలలో డిజె సౌండ్స్, ఊరేగింపులు నిషేదించడం జరుగుతుందని, ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు చేపడతామని చెప్పారు.

ఇంటి పన్నుపై వడ్డీ మాఫీ

- కమిషనర్ పి.ఆర్.మనోహర్ వెల్లడి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఇంటి పన్నుపై వడ్డీ మొత్తాన్ని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జిఒ జారీ చేసిందని బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఆస్తిపన్నును వందశాతం చెల్లించాలని, అందుకే ఆస్తి బకాయిలు సకాలంలో చెల్లించవచ్చునన్నారు. నగర పంచాయతీలో నివాసమున్న ప్రజలు నగర పంచాయతీ కార్యాలయానికి విచ్చేసి వారి ఆస్తి పన్నులు చెల్లించి ఆన్‌లైన్ రశీదు పొందాలని అన్నారు. పన్ను, బకాయిలు చెల్లింపులకు ఈ నెల 31 చివరి తేదీ అని తెలిపారు. బకాయిలు సకాలంలో చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

కలికిరి జెఎన్‌టియు కళాశాలకు న్యాక్ గుర్తింపు

కలికిరి : జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల కలికిరికి న్యాక్ గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జెఎన్‌టియు అనంతపురం విశ్వవిద్యాలయం వారి అనుబంధ కళాశాలలకు న్యాక్ 'ఎ' గ్రేడ్ గుర్తింపు లభించిందని గత నెల నుంచి 8 వరకు అనంతపురం జెఎన్‌టియు వారి అనుబంధ కళాశాలలో న్యాక్ బృందం పర్యటించి విశ్వవిద్యాలయం, కళాశాలలోని నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. అనంతపురం విశ్వవిద్యాలయం విభాగాలు, అను బంధ కళాశాలలో పరిశుభ్రత, అధ్యాపకుల బోధన తీరు, పరిశోధన విభాగాలు, మౌలిక వసతులు, కళాశాలలో అమలు చేసే విద్యా విధానాలు, ఫలితాలు, హాస్టల్లో వసతి సదుపాయం వంటి అన్ని విభాగాలను పరిశీలించడం జరిగిందన్నారు. న్యాక్ కమిటీ పరిశీలన నివేదిక ఆధారంగా ఎ గ్రేడ్ ని కేటాయించినట్లు తెలిపారు. న్యాక్ గ్రేడ్ రావడం వల్ల యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ నుంచి విశ్వవిద్యాలయం, కళాశాలల అభివృద్ధికి నిధులు రావడం జరుగుతుందని, యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో విద్యాబోధన చేసే విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు వస్తుందని అన్నారు. న్యాక్ ఎ గ్రేడ్ రావడం పట్ల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, ప్రొఫెసర్ కె.త్యాగరాజన్, విభాగాధిపతులు, అధ్యాపక, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలకడ : మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతిలో చేరు విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మలంగ్‌షావలి పేర్కొన్నారు.2024-25 సంవత్సరానికి గాను ఆరవ తరగతిలో ప్రవేశం పొందగోరే విద్యార్థులు ఒసి, బిసిలు రూ.150, ఎస్‌సి, ఎస్‌టిలు రూ.75లు చెల్లించి ఈనెల 31 వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ఇవ్వబడతాయని అన్నారు.ఏప్రిల్ 21న పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించబడునని తెలిపారు. **తంబళ్లపల్లి :** ఆదర్శ పాఠశాల తంబళ్లపల్లె ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను ఆరవ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు ఒసి, బిసిలు లు 150, ఎస్‌సి, ఎస్‌టిలు రూ.75లు చెల్లించి ఈనెల 31.03.24 వ తేదీ లోపల www.cse.ap.gov.in లేదా apms.ap. gov.in సైట్ నందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 21న ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు.

మైక్ ప్రచారాలను నిలిపివేయండి

బి.కొత్తకోట : ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా వీధుల్లో ఆటోలో మైక్‌లతో చేసే ప్రచారాలను కొన్ని రోజుల పాటు నిలిపి వేయాలని సిపిఐ నియోజవర్గం కార్యదర్శి మనోహర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థుల చదు వులకు ఆటంకం కలుగకుండా మైక్ ద్వారా చేసే ప్రకటనలు కొన్ని రోజులపాటు కట్టడి చేయాలని అధికారులను చర్యలు తీసుకోవాలని కోరారు.

IN THE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE : KADAPA

O.S.No. 937/2023

Kalikiri Venkata Subbaiah. ...Plaintiff

Vs

1. Borra Jhansi @ Bankapuri Jhansi,
2. Bankapuri Siva Anil Kumar,

...Defendants

D1. Borra Jhansi @ Bankapuri Jhansi, W/o. Bankapuri Siva Anil Kumar, Hindu, Employee, R/o D.No. 7/519, Old Krishna Nagar, Railwaykoduru-516101.

దావా సమను

యీ దావాలో పరిహారం నిమిత్తం నీ మీద దావా వేసి యుండుటవలన స్వతహాగా గాని, సంపూర్ణముగా సంజాయిషి పొందిన అన్ని ప్రశ్నలకు ఉత్తరములు చెప్పగూడిన ప్లీడరు ద్వారా గాని, అట్లే అన్ని ప్రశ్నలకు వుత్తరము చెప్పగూడిన కూడా వచ్చే ఏదో ఒక మనిషి ద్వారా గాని సదరు దావాకు ప్రత్యుత్తము చెప్పగలందులకు 2024 సం.3వ నెల 7వ తేదీన 10.30 గంటలకు యీ కోర్టులో హాజరగుటకున్న మరియు ఆ రోజున మీరు ఈ దావాలో సంజాయిషీ చెప్ప రిటెన్ స్టేటుమెంటు ఈ సమను ముట్టిన 30 రోజులలోగా దాఖలు చేయుటకున్న మరియు ఆరోజున మీరు ఆధారపడనటువంటిన్ని మీ ఆధీనములో నున్నటువంటిన్నీ మీ ప్రతివాదమునకు గానీ, మినహాయింపు వాదనకు గాని కౌంటర్ క్లైమ్ గాని, అవసరమైన సమస్త దస్తావేజులు దాఖలు చేయుటకున్నా మరియు మీ ఆధీనములో నున్నను, లేకున్నను మీరు మీ ప్రతివాదన మినహాయింపు కౌంటర్ క్లైమ్‌లకు ఆధారపడు సమస్త దస్తావేజుల జాబితాలో మీ రిటెన్ స్టేట్‌మెంట్‌కు అనుబంధముగా, చేర్చుటకు, ఆదేశించటమైనది. పై చెప్పబడ్డ దినమందు నీవు హాజరుగాకుండా తప్పిపోయే యెడల నీ పరోక్షమందు ఆ వాజ్యమును విమర్శ చేసి తీర్మానించటముగునని మీరు తెల్సుకోవలసినదని. ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

//By Order of the Court//

SHAIK NOORJAHAN BEGUM

Advocate for the Plaintiff, Kadapa City. Cell: 8341492639.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం : ఎంపీ

ప్రజాశక్తి-పుల్లంపేట

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అర్హులైన వారందరికీ పక్కా గృహాలు మంజూరు చేసినట్లు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మంగంపేట గ్రామ సచివాలయ పరిధిలోని ఆర్‌ఆర్ సెంటర్-1 పరిధిలోగల 1028 లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో అర్హత గలవారిని గుర్తించి ఇంటి స్థలాలు కేటాయించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మంగంపేట పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిం చామని అన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో మరో మారు వైసిపిని అధికారంలోకి తీసుకొని వస్తే తాము చెప్పినవన్నీ చేశామని, హామీలు ఇవ్వని వాటిని కూడా చేసి చూపిస్తామని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే నిరంతరం ప్రజలకు సేవ అందిస్తున్న గ్రామ స్వరాజ్యమైన సచివాలయాలు కచ్చితంగా మూత వేసి జన్మభూమి కమిటీల చేతుల్లోకి పెత్తనం, అధికారం వెళుతుందని అన్నారు. టిడిపి నాయకులు మాయ మాటలు చెప్పి ప్రజలను మభ్య పెట్టడానికి వస్తున్నారని వారిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. తమ ప్రభుత్వం వల్ల మంచి జరుగుంటేనే ఓటు వేయండి అని లేనిపక్షంలో ఓటు వేయవద్దని చెప్పిన ఏకైక నాయకుడు సిఎం జగన్ మాత్రమేనని అన్నారు.మంగంపేటలో ఎటువంటి సమస్యలు ఉన్న మండల కన్వీనర్ సాయి కిషోర్ రెడ్డి, యువ నాయకుడు తల్లెం భరత్‌కుమార్ రెడ్డి నిరంతరం సకాలంలో పనులు జరిగేలా చూస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ మోహన్ రావు, తహశీల్దార్ శేషగిరిరావు, డిఎస్‌పి చైతన్య, ఆర్ఐ మ్యోహన్, సిపిఒ సుదర్శన్ రెడ్డి, ఎపి టూరిజం డైరెక్టర్, మండల కన్వీనర్ సాయి కిశోర్‌రెడ్డి, గుంతకల్ రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, రమణారెడ్డి, ఎస్‌సి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమనవర్మ, సర్పంచ్ సుధాకర్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం : డాక్టర్

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రమేష్‌బాబు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం బండ్లపై సచివాలయం పరిధిలో రెండవ దశ జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ వెంకటరత్న, వైసిపి నాయకులు చంద్రమోహన్, వైస్ ఎంపిపి జయ ప్రకాశ్‌రెడ్డిలతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించాలని తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి దశ కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించడానికి మరోసారి జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని, ఇవి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని అన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు అవసరమైన పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా అవసరమైన వైద్య చికిత్సలను పొందవచ్చని తెలిపారు.శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 283 మంది వైద్య సేవలు పొందారని తెలిపారు. ఇందులో 108 మందికి ప్రత్యేక వైద్య పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. వీరందరికీ అవసరమైన మందులను పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్, ఎంఎల్‌హెచ్‌పిలు, పంచాయతీ కార్యదర్శులు మారెప్ప, సరస్వతి, వాలంటీర్లు, పాల్గొన్నారు. **రామాపురం :** అందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ముక్కోటి బసిరెడ్డి అన్నారు.రామాపురం మండలం కుమ్మరపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఇంటి వద్దకే వైద్యం అందేలా చూడడం మహత్తర కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్కోటి భారతమ్మ, రామాపురం మండలం వైద్యాధికారి వినోద్ కుమార్, సిహెచ్ఒ ఎలియాజర్‌నాయకులు, ప్రజలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న శాశ్వత భూహక్కు ప్రజలకు వరం : నిస్సార్ అహ్మద్

ప్రజాశక్తి-రామసముద్రం

జగనన్న శాశ్వత భూ హక్కు- భూరక్ష పథకం ప్రజలకు వరం లాంటిదని మదనపల్లి వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం రామసముద్రం మండలం కురిజల పంచాయతిలో జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో అర్హులకు సర్పంచ్ మంగమ్మ, మాజీ ఎంపిటిసి దొడ్డిపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో భుహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వంద సంవత్సరాల నుంచి జరగని రీ సర్వే పనులు జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం ద్వారా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులందరికీ మేలు చేశారని అన్నారు. ప్రజల భూ సమస్యలకు స్వస్తి పలికి ప్రతి రైతు భూమిని సర్వే చేసి హద్దురాలు ఏర్పాటు చేసి భూములను డిజిటలైజేషన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ నారాయణస్వామి, ఎంపిపి కుసుమకుమారి, వైస్‌ఎంపిపి రమణారెడ్డి, సింగల్ విండో చైర్మన్ కేశవరెడ్డి, ఎంపిటిసి పద్మ , ఈశ్వర్, కృష్ణప్ప, విఆర్‌ఒ రెహమాన్, విఆర్‌ఎ దేవరాజ్, గెవన్న, కత్తి వాలెప్ప, అంబరీష్, కేశవ పాల్గొన్నారు.

రైతుకు భూహక్కు పత్రాన్ని అందిస్తున్న నిస్సార్ అహ్మద్

టిడిపి, జనసేన నుంచి వైసిపిలోకి చేరికలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సమక్షంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు వైసిపిలో చేరారు. మండలం ఓబనపల్లి గ్రామ పరిధిలోని బయనపల్లి, సింగిరి వారిపల్లి, ఎర్రమిట్ట, ఒ.కొత్తపల్లి, వడ్డిపల్లి, దళితవాడ గ్రామాల నుంచి కస్తూరి ధనుంజయ నాయుడు, పోతిన శ్రీనాథ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం, జనసేన పార్టీలో నుండి వెయ్యి కుటుంబాలు వైసిపిలో చేరారని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజరెడ్డి, టూరిజం డైరెక్టర్ సాయి కిషోర్‌రెడ్డి, మండల నాగేంద్ర, మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నాయకులు ఎల్.వి మోహన్ రెడ్డి, సహదేవరెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, రమేష్, నాగులునాయుడు, ప్రతాపరెడ్డి, కస్తూరి సుబ్బరాయుడు, కస్తూరి హరినాథ్, కాకర్ల వెంకట శివ పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన జనసేన, టిడిపి నాయకులతో ఎంపీ, ఎమ్మెల్యేలు

రూరల్ సిఐగా సురేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు రూరల్ సిఐగా పి.సురేంద్రనాథ్‌రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం వైసిపి కార్యాలయంలో నందు పార్ల మెంటు సభ్యులు మిథున్ రెడ్డిని, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో అందరి సహకారం అవసరమని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డిధ్వజరెడ్డి, టూరిజం డైరెక్టర్ సాయి కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి కోసమే ఎమ్మెల్యేపై ఆరోపణలు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాజకీయ ఉనికి, స్వార్థపూరిత రాజకీయాల కోసమే నియోజకవర్గ అభివృద్ధి, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేస్తున్న కృషిని ఓర్వలేకనే మాజీ మున్సిపల్ చైర్మన్ భర్త సలావుద్దీన్ అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి మాట్లాడారు.మాట్లాడారు. 2015 మున్సిపల్ ఎన్నికల సమయంలో ఎవరు ఊహించని విధంగా మైనార్టీ వర్గానికి చెందిన కె.నసిబూన్‌ఖానమ్ (మహిళ)ను మున్సిపల్ చైర్మన్‌గా ఎంపిక చేశారన్నారు. ఐదు సంవత్సరాల పాటు ఆ పదవిలో ఎలాంటి అడ్డంకులు రానివ్వకుండా కొనసాగేలా ఎమ్మెల్యే సహకరించారని అన్నారు. చైర్మన్ భర్త కె సలావుద్దీన్ అన్నకు కో-ఆప్షన్ పదవిని కూడా అప్పగించి మున్సిపల్ శాఖలో రాజకీయంగా, సేవా తత్వమైనటువంటి ఉన్నతమైన పదవిని ఎమ్మెల్యే అప్పగించారన్నారు. ఐదు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగిన సలావుద్దీన్ తర్వాత రాజకీయ కక్ష్య తోనే ఎమ్మెల్యే పై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజకీయంగా అవకాశం ఇవ్వలేదనే అక్కసు తో అభివృద్ధి, ప్రజాసేవను మరిచిన టిడిపి నాయకులతో జతకట్టి నిత్యం అభివృద్ధి, ప్రజల సంక్షేమం, ఆరోగ్యం, విద్య తదితర వాటికోసం పరితపిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పైన వ్యక్తిగత కక్ష్య పెంచుకొని ఆరోపణలు చేయడం సలావుద్దీన్ తగదన్నారు. రాయచోటిలో మరో మైనారిటీ మహిళ ఎం.జకియా ఖానమ్ కు ఎమ్మెల్సీ పదవిని ఇప్పించడంతో పాటు రాష్ట్రంలో అత్యున్నత పదవి అయిన మండల డిప్యూటీ చైర్పర్సన్‌గా ముఖ్యమంత్రి ద్వారా ఎంపిక చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోవాలని లేకుంటే ప్రజలే తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

మహారాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు

H.M.O.P.No. 73/2023

ముప్పాల సంధ్య, W/o జయరామరాజు, D/o చంద్రన్న, మెయిన్ రాజు స్కూల్, వెనుకవైపు, మదనపల్లి రోడ్డు, రాయచోటి టౌన్ మరియు మండలము, అన్నమయ్య జిల్లా.

...పిటిషనర్

Vs

ముప్పాల జయరామరాజు, S/o నరసింహరాజు, డోర్‌నెం.3/40, శ్రీ వెంకటేశ్వరవీధి, లక్కిరెడ్డిపల్లి టౌన్, మరియు మండలము, అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంట్

ప్రకటన

పై దావాలో పిటిషనర్, రెస్పాండెంట్ అయిన నీపైన విడాకులు తీసుకొనుటకు గాను దావా దాఖలు చేసియున్నారు. నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 6-3-2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు సదరు కోర్టులో హాజరు అయిన నీ ఆక్షేపణలు తెలుపుకోనవలయును. లేనంతట నీ పరోక్షమున తీర్మానించబడును. అని ఇందుమూలముగా ఖచ్చితముగా తెలియజేయడమైనది.

//By Order of the Court//

బి. ఆదిరెడ్డినాయక్

పిటిషనర్ తరపు న్యాయవాది, రాయచోటి, అన్నమయ్య జిల్లా.

వెలుగు పాఠశాలను సందర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-మదనపల్లి

మండల పరిధిలోని కోళ్ళబైలు పంచాయతీ, అమ్మచెరువు మిట్టలో వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంకు తిరుపతి రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ధనుంజయ్‌రెడ్డి, హెడ్ మాస్టర్ వాసుదేవ్‌రెడ్డి, సుపరింటెండెంట్ ఉదయ్‌కుమార్‌లు శుక్రవారం సందర్శించినట్లు వెలుగు సెక్రటరీ యం.ఉదయ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుంజయ్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నప్పటికీ ఎన్నో సేవలు చేసారని, కోవిడ్ సమయంలో కూడా ఆక్సిజన్ సిలిండర్లను అందించి ఆదుకున్నారని అన్నారు.అనంతరం ధనుంజయ్‌రెడ్డిని వెలుగు సిబ్బంది మొమెంటో అందించి దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ లీనాకుమారి, సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.

సమాజ సేవలో 'మిట్స్' ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపును నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాగంగా ఈ నెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు బి.కొత్తకోట మండలంలోని శీలంవారిపల్లిలో సమాజ సేవ కార్యక్రమాలు చేయబోతున్నారని అన్నారు. కళాశాల నుంచి స్పెషల్ క్యాంపును ప్రారంభించారు. స్పెషల్ క్యాంపులో భాగంగా 50 మంది ఎన్ఎ స్ఎస్ విద్యార్థులు శీలంవారిపల్లిలో పరిసరాల పరిశుభ్రత, స్కూల్ పరిసరాల శుభ్రత, ఆరోగ్య భద్రత అవగాహన సర్వే, అక్షరాస్యత సర్వే, మొక్కలు నాటడం, రోడ్డు మరమ్మతులు, డ్రెయినేజీ పరిశుభ్రత, వర్షపు నీరు సంరక్షణ, ఆధునిక వ్యయసాయ విధానాల అవగాహన కార్యక్రమాలు చేపట్ట బోతున్నారని తెలిపారు. ఇలాంటి ఉపయోగకరమైన కార్యక్రమాన్ని చేయ డానికి సహకరించిన గ్రామ సర్పంచ్ నాగిరెడ్డికి, గ్రామ పెద్దలకు, గ్రామ ప్రజ లకు ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో కళాశాల డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ శ్రీమంతబసు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమాల్‌బాషా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.రాజేష్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ బస్సు క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఇఒలు

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రం పుల్లంపేటలో ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగతి రుమలరావు ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం నాడు-నాడు నేడు పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు-నేడు పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల బూత్ కలిగిన ప్రతి గదిని అన్ని వసతులతో సిద్ధం చేయాలని అన్నారు. పనులపై ఎటువంటి సందేహాలు ఉన్న తమను సంప్రదిస్తే సూచనలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలు ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ప్రత్యేక అధికారి రూత్‌మేరీ, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నరేంద్రనాథ్, ఎంఐఎస్ శివ, మండల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కరెంట్ కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి -బి.కొత్తకోట

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్‌అహ్మద్ చొరవతో బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని కరెంట్ కాలనీలో ఇటీవల కొత్తగా వేసిన ఐదు విద్యుత్ స్తంభాలకు శుక్రవారం విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొ న్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల శ్రేయస్సు కోసం అధిక ప్రాధాన్యతనిస్తున్నామని, పట్టణంలో నెలకొన్న సమస్యలను సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగర పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని అన్నారు. మాజీ ఎంపిపి వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్‌అహ్మద్ తోడ్పాటు మరువలేనిదన్నారు. తమ సమస్యలను దృష్టిలో ఉంచుకొని సత్వరమే వీధి దీపాలను ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, మాజీ ఎంపిపి పాగొండ ఖలీల్ అహ్మద్, కమిషనర్ పి.ఆర్. మనోహర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

వీధి దీపాలు వేస్తున్న సిబ్బంది

విఆర్‌ఒకు ఘన సన్మానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజాసమస్యల పరిష్కారంలో చొరవ చూపడంతోపాటు ఒకటో సచివాలయం పరిధిలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో కీల కపాత్ర పోషించి అందరికి సంక్షేమ పథకాలు అందేలా చొరవ చూపిన ఒకటవ సచి వాలయం విఆర్‌ఒ అమర నారాయణను ఘనంగా సన్మానించారు. సచివాలయం కన్వీనర్ జి.చాంద్ బాషా, వైసిపి నాయకులు జనార్దన్ శాలువా, పూలమాలతో సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఆర్‌ఒ నారాయణ వృత్తిపట్ల ఎంతో నిబద్ధత కలిగిన వ్యక్తని అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అందరి మన్న నలను పొందాలని కితాబునిచ్చారు.రానున్న రోజుల్లో ప్రజలకు మరింత సేవచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్‌మౌలా పాల్గొన్నారు.

విఆర్‌ఒ అమరనారాయణను సన్మానిస్తున్న చాంద్‌బాషా, సిబ్బంది

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

కళలకు నిలయం నందలూరు

ప్రజాశక్తి-నందలూరు

విద్య, వైజ్ఞానిక, రంగాలతోపాటు కళలకు కాణాచిగా నందలూరు ప్రజ్వరిల్లుతోందని రైల్వే సీనియర్ మెడికల్ ఆఫీసర్ బచ్చు జయభాస్కరరావు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ సంస్థ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రైల్వే ఇన్స్టిట్యూట్‌లో ఆ సంస్థ అధ్యక్షులు వేపగుంట సామ్రాజ్ ఆధ్వర్యంలో రాజంపేట పార్లమెంటు పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్, సైన్స్ ఫేర్, చిత్రలేఖనం పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాది ఆనంద్‌కుమార్, ప్రభుత్వ వైద్యులు హీరేంద్ర సింగ్, సౌమ్యనాథ పెట్రోల్ బంక్ యజమాని ఉప్పుశెట్టి సుధీర్, వేణుగోపాల నాయుడు, కంభం జితేంద్ర కుమార్, కుర్ర మణియాదవ్, టిడిపి పార్టీ మోడపోతుల రాము, కాన కుర్తి వెంకటయ్య, గుండు (రేమో) సురేష్, గంధం గంగాధర్, విశ్రాంత రైల్వే గార్డ్ గురు ప్రసాద్ హాజరయ్యారు.

కార్యకర్తలతో జయచంద్రారెడ్డి సమావేశం

ప్రజాశక్తి-పెద్దమండ్యం

తంబళ్లపల్లి నియోజక వర్గం టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి దాసిరిపల్లి జయచంద్రారెడ్డి పెద్దమండ్యం కార్యకర్తలతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత మాసబావి దగ్గర చదివింపులు, రామాలయం దగ్గర పూజ కార్యక్రమం నిర్వహించారు. పూజ కార్యక్రమం తరువాత సభను ఉద్దేశించి మాట్లాడారు. 1999 లో పెద్దమండ్యం మండలానికి సిమెంట్ ఫ్యాక్టరీ , తర్వాత ఇథనాల్ ఫ్యాక్టరీ మంజూరు అయ్యిందని తెలిపారు. ఈ రెండు ఫ్యాక్టరీలు ఇక్కడ ఏర్పాటు చేయలేదని చెప్పారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు, యువతకు ఉద్యోగాలు కోసం ఒక ఫ్యాక్టరీ తీసుకు వస్తానని తెలిపారు. కార్తకర్తలే పార్టీకి మూలస్తంభాల్లాంటి వారని వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపుకు ముఖ్యమైన పాత్ర పోషించాలని కోరారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కార్యకర్తలంతా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కోరారు. కార్యక్రమంలో మాజి సర్పంచ్‌లు, మాజి ఎంపిటిసిలు, మాజీ జడ్‌పిటిసిలు, జనసేన నాయకులు, రాష్ట్ర కార్య నిరవాహక కార్యదర్శి పర్విన్‌తాజ్, తెలుగుదేశం యువత అధ్యక్షులు గంగాధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-ములకలచెరువు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని వేపూరికోట సమీపంలో మద్యం విక్రయిస్తున్నట్లు ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో వేపూరికోటకు చెందిన బి.కృష్ణప్పను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 14 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.